“మేరే అంగనేమే తుమ్హారా క్యా కామ్‌హై” చేతులతో పెద్ద పెద్దగా చప్పట్లు కొడుతూ పాట పాడుతూ నడుస్తున్నారు వాళ్ళంతా.

బొంగురు పోయిన గొంతులతో గట్టిగా పాడుతూ ప్రక్కన మద్దెల వాళ్ళు వాయిస్తుంటే పెళ్ళికి తరలి వెడుతున్న పెళ్ళి వారిలా ఆ రోడ్డంతా ఆక్రమించి నడుస్తున్నారు. ఆ వీథిలో పిల్లలంతా వాళ్ళ వెనకే చేరారు. పిల్లలకు వాళ్ళని వింతగా చూడ్డం, వాళ్ళు కాలనీ దాటి వెళ్ళే వరకూ వాళ్ళ వెంటే తిరగడం అంటే మహాసరదా.

శంకర మంచి సత్యం స్మారక '89 ఉగాది కథల పోటీలో రూ. 200 ప్రోత్సాహక బహుమతి గెలుచుకున్న రచన

వాళ్ళూ ఎప్పుడోగానీ జనం మధ్యలోకి రారు. అందుకే వాళ్ళ వెనగాల అలా గుంపు చేరడం.



# జారిపోయిన జీవితం

— ఇంగువ అన్నపూర్ణ

చాలా మందిలో ఇప్పటికీ ఒక నమ్మకం వుంది. పసి పిల్లలను వీళ్ళు ఎత్తుకుని దీవిస్తే ఆ తర్వాత ఆ పిల్లలకే గండాలు లేకుండా పెరుగుతారని. కాని వీరి కోరికలు మాత్రం తీర్చడం సామాన్య సంసారులకు తలకు మించిన భారం అవుతుంటుంది. “ఎప్పుడో ఒక సారి వస్తాము మేం అడిగింది ఎందు కివ్వరు” అని వీరంటే, “మా శక్తికి మించి కోరితే మేము ఎక్కడ నించి తేగలం” అంటారు మధ్య తరగతి గృహస్థులు.

“ఇంకెవరింటికీ మనం వెళ్ళేది?” అడిగింది భైరవి.

“ఆ చివర పంతొమ్మిదో నెంబర్ ఇంటికి” అన్నది వాళ్ళలో అందరి కన్నా పెద్దగా కనిపిస్తున్న కాత్యాయని. ఆమె వయసు యాభై సంవత్సరాలుంటుంది. ఇరవై నాలుగ్గంటలూ జరదా పాన్ నములుతూ, పళ్ళు గారపట్టి నోరు తెరిస్తే మహా భయంకరంగా కనిపిస్తుంటుంది.

“పంతొమ్మిదో నెంబరు ఇల్లా?” అనుమానంగా అడిగింది భైరవి.

“అవును.”

“ఎందుకా ఇంటికి?”

“ఆ ఇంటి వాళ్ళమ్మాయికి కొడుకు పుట్టాడుట. మనం ఇనామ్ తీసుకోనడానికి ఆ ఇంటికి వెళ్ళేది” అన్నాడు మద్దెల వాయిస్తున్న సీతారామ్.

మాటల్లోనే అందరూ పంతొమ్మిదో నెంబర్ ఇంటికి చేరారు. ఆ వీథిలో అటు ఇటు వున్న ఇళ్ళ వాళ్ళంతా వాకిళ్ళలోకి వచ్చి వీళ్ళు ఎవరింటికి వెళ్తారా అని కుతూహలంగా చూస్తున్నారు. అందరూ మన ఇంటికి రాకపోతే బాగుండునని మనసులో కోరుకుంటున్నారు. కొత్తగా పెళ్ళయిన ఇంటికి పిల్లో, పిల్లాడో పుడితేనో రావడం రివాజే. ఎవరింట్లో ఏ శుభ కార్యం జరిగినా వైర్‌లెస్ కంటే వేగంగా గ్రహించగలరు వీళ్ళు.

వీళ్ళని చూస్తూనే పంతొమ్మిదో నెంబరు ఇంట్లో వాళ్ళకి గుండెల్లో సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌లే పరిగెత్తాయి. త్వరగా వచ్చి గేటు మూసే వ్యవధి లేకపోయింది. అప్పటికే అందరూ గేటు తెరుచుకుని వరండాలో కొచ్చి సుఖాసీనులయిపోయారు. భైరవి, కామేశ్వరి డాన్సు చెయ్యడం మొదలెట్టారు. హిందీ పాటేదో అందుకుని మిగతా వాళ్ళు కోరస్ పాడుతున్నారు.

ఇంట్లో వాళ్ళ మొహాలు పాలి పోయాయి వీళ్ళని చూడగానే.

“ఏడమ్మా బాబు? తీసుకురా ఎత్తు కుంటాం” అన్నది కాత్యాయని ఆ ఇంటి యజమానురాలితో.

“ఇదుగో బాబు” భైరవి చేతికి బాబుని అందించింది బాబు తల్లి. భైరవి ఆప్యాయంగా అందుకుంది వాడిని. వంగి నుదుటి మీద ముద్దు పెట్టుకుంది. అందరూ ఎత్తుకున్నారు పసివాడిని. కాత్యాయని పిల్లవాడ్ని ఎత్తుకుని దగ్గరికి తీసుకోగానే వాడు కెవ్వున ఏడిచాడు. వెంటనే భైరవి కాత్యాయని చేతిలోంచి పిల్లవాడిని తీసుకుంది.

“ఏదీ పిల్లవాడి అమ్మమ్మ? ఇటు పిలు” అన్నది బాబు తల్లితో కాత్యాయని ఆవిడ రాగానే.

“నాలుగు సిల్కు చీరెలు. మాట పదార్లు ఇక్కడ పెట్టే... ...కెళ్ళవమ్మా” అన్నది కాత్యా...ని

ఆ మాటతో ... కి గుండెలో

బరువు పెట్టినట్టయింది.

"అమ్మో అంతా?" అన్నదావిడ అప్రయత్నంగా గుండెల మీద చెయ్యేసుకుని.

"ఏమమ్మా అట్లా గంటావు? ఏమంత ఎక్కువడిగామని? వీడు పెద్ద వాడయితే ఎన్ని లక్షలు కట్నం వస్తుంది? అప్పుడు అమ్మో అనుకుంటావా? మగ పిల్లవాడు కాబట్టి అడిగాము. ఆడపిల్ల యితే మేము అడగం" అన్నది కాత్యాయని నాకూ బాధలు తెలుసన్నట్టు.

"అంతంత అడిగితే మేమివ్వలేం. ఏదో ఒక మాలు చీరె. ఒక పది రూపా యిలు ఇస్తాం. మాట్లాడకుండా తీసు కెళ్ళండి" అన్నదావిడ. ఆడవాళ్ళకు సహజమైన బేరం చేసే గుణం ఇక్కడా కనపడింది. ఎక్కడైనా బేరమనేది కుదురుతుందేమో కాని వీళ్ళ దగ్గర కాదని అనుభవమున్న వాళ్ళకే తెలుస్తుంది.

"ఏంటమ్మోవ్! మేమేమన్నా అడుక్కుతినే వాళ్ళమనుకున్నావా నదీ పరకా పారేస్తే ఏరుకోటానికి? మా హక్కుగా అడుతున్నాం. మాటపదార్లక్కడ పెట్టు" అంటూ చప్పట్లు కొట్టుకుంటూ మీది మీది కొచ్చారు వాళ్ళలో ఇద్దరు.

పిల్లవాడి తండ్రి లోపల నుంచి దూకుడుగా వచ్చాడు బయటకు, "మీ రెంతంటే అంతా ఇస్తామనుకుంటున్నారా? ఎందుకివ్వాలి? మేం ఇవ్వం" అన్నాడు దురుసుగా.

"ఇవ్వకపోతే ఊరుకుంటామనుకున్నావా? మా సంగతి తెలియదు నీకు" అన్నారా ఇద్దరూ పైపైకి వస్తూ.

"వచ్చినా ఇవ్వం. ఏం చేస్తారో చేస్కోండి పోనీ కదా ఎంతో కొంత ఇద్దామనుకుంటే బాగా డిమాండ్ చేస్తున్నారే!"

ఆ ఇద్దరూ చన్నన చీరెలు పైకెత్తేసారు- అందరూ చూస్తూండగానే, చేతులతో అసభ్యమైన ముద్రలు చూపడం, బూతులు మాట్లాడ్డం చేయసాగారు.

అందరికీ తల కొట్టేసినట్లనిపించింది. ఇంకేమన్నా మాట్లాడాలంటే నోరు విప్పాలంటేనే ఆ ఇంట్లో అందరికీ చచ్చేంత సిగ్గుగా వుంది. పిల్ల వాడి తల్లి మొగుడ్ని లోపలకి లాక్కు పోయింది. మంచిగా బ్రతిమాలి చెప్పక పోతే ఇంకా రెచ్చిపోతారనిపించింది ఇంటావిడకి. అంతవరకు మాట్లాడ కుండా నుంచున్నదల్లా భైరవి స్పృహ తెచ్చుకుని కదిలింది. కాత్యాయని దగ్గరికి వెళ్ళి.

'అక్కా నేను వెళ్ళిమాట్లాడివస్తాను. వీళ్ళని గొడవ చేయవద్దని చెప్పు" అన్నది.

"నీకు నమ్మకం వుందా మన్వేళ్ళు మాట్లాడితే ఇస్తారని? అసలే నీకు నోరు లేదు" అన్నది కాత్యాయని అనుమానంగా చూస్తూ.

"ప్రయత్నిస్తాను. పని జరుగుతుందనుకుంటాను" అనేసి లోపలికి వెళ్ళింది భైరవి. వెనకాలే ఇంటావిడ లోపలికి వెళ్ళింది.

"ఎంతైనా భైరవి తెలివి కలదిలే. చదువుకున్నది కదా. బాగా చెప్పగలదు" అన్నాడు సీతారావ్ కాత్యాయని పక్కకి వచ్చి కూర్చుంటూ.

గేటు దగ్గర మూగిన పిల్లల గుంపుని చూసి.

"ఏంటి ఏంత మాద్దామని అట్లా మూగారు. వెళ్ళండెళ్ళండి" అని కసిరింది ఇందాక ఆగం చేసిన రజియా అనే ఆమె.

"మా ఇష్టం. మేమిక్కడే నుంచుంటాం" అన్నాడొక సెంకి పిల్లవాడు.

"మీ ఇల్లెక్కడో చెప్పు బాబూ. మీ ఇంటికి కూడా వస్తాం" అన్నది కాత్యాయని గారపళ్ళు బయటపడేలా నవ్వుతూ ఆ గారపళ్ళ అందం చూసిన ఆ పిల్లవాడు జడుసుకుని తిరిగి చూడకుండా పరుగు తీసాడు ఇంటికి.

కాసేపు సినిమాల గురించి, అమితాబ్‌బచ్చన్ గురించి మాట్లాడుకున్నారు. అమితాబ్‌బచ్చన్ అంటే వీళ్ళందరికీ చాలా అభిమానం. సినిమాల ప్రసక్తి రాగానే.

"సాయంత్రం సిన్మా కెళ్దాం. షెహన్ షా బాగుందిట" అన్నది రజియా.

"మీ ఇంటికి ఉత్తరం రాసి డబ్బు తెప్పించు అలాగే చూద్దాం" అన్నాడు సీతారావ్ కల్పించుకుంటూ.

అప్పుడప్పుడు ఇళ్ళకి వెళ్ళి రావడం వీళ్ళకి మామూలే.

అప్పుడే భైరవి లోపలి నుంచి బయటి కొచ్చింది. ఆమె చేతిలో నాలుగు సిల్కు చీరెలు, మాటపదహార్లు మెరుస్తున్నాయి. చేతిలో వున్న వాటిని కాత్యాయనికి అందించింది.

"మొత్తానికి సంపాయించావే బాగానే! గట్టిదానివే! ఏమో అనుకున్నాను" అన్నది కాత్యాయని మెచ్చుకుంటూ.

"నేను చెప్పలా భైరవి సాధించుకొస్తుందని. ఎంతైనా చదువుకున్నది కదా" వంత పాడాడు సీతారావ్.

అందరూ చీరెలు చూసే సంబరంలో మునిగారు. భైరవిని ఎవ్వరూ పట్టించుకోలేదు. ఎవరైనా పరీక్షగా భైరవిని గమనించి వుంటే ఆమె ముఖంలో వుండాల్సినంత సంతోషం లేదని గ్రహించేవారు.

"కష్టపడి సాధించావు కాబట్టి నీకు నచ్చిన చీరె తీసుకో" అన్నది కాత్యాయని ఇంటికి చేరాక.

"నాకేం వద్దక్కా. అవన్నీ మీకోసమే" నిర్లిప్తంగా అన్నది భైరవి. "నీకు చీరెలంటే ఇష్టమేగా. ఇవి కొత్తవిగా కూడా కనిపిస్తున్నాయి.

"అవును అవి కొత్త చీరెలే" అని ఆగి చెప్పాలా వద్దా అన్నట్టు చూసింది.

"ఏమిటే భైరవీ. ఏదో దాస్తున్నావు. నా దగ్గర రహస్యమా?"

చెప్పలేక చెప్పింది భైరవి. "ఇవి నా చీరెలే. నాకోసం మా అమ్మ కొన్నవి."

"మీ అమ్మ కొన్నవా? అంటే... ఆవిడ..."

"అవును. ఆవిడ మా అమ్మ."

నమ్మలేనట్టు చూసింది కాత్యాయని.

అంత కరకుగా వుండే ఆమె గుండెలో ఏదో గుచ్చి గుచ్చుకున్న భావన.

"నా గురించి లోకానికి తెలియడం ఇష్టంలేక ఇరవయి సంవత్సరాలు నన్ను కాపాడింది మా అమ్మ... పెళ్ళి వయసొచ్చాక నన్ను వదిలేసి చెల్లెలికి సంబంధాలు చూస్తున్నప్పుడు ఎలా తెలిసిందో లోకానికి నా గురించి తెలిసింది. నా కాళ్ళ మీద నిలబడ్డదాన్ని... నా జీవితం నేను స్వతంత్రంగా బ్రతుకుతున్నదాన్ని... బలవంతంగా ఈ రొంపిలోకి లాగబడ్డాను. నాకు జీవితమే జారిపోయాక ఎందుకక్కా ఈ చీరె సారెలు... వద్దు... నాకేం వద్దు... ఇవ్వగలిగితే నా జీవితాన్ని నాకివ్వండి చాలు... నాకేమీ వద్దు" చీరె చెంగు ముఖాని కడ్డు పెట్టుకుని లోపలి గదిలో కెళ్ళిపోయింది భైరవి.

*

## అకవిత 88

నేరస్థుడ్ని నేను
నిందితుడ్ని నేను
నన్ను నేనే హత్య చేసుకున్నాను
నన్ను నేనే హతమార్చుకున్నాను
నా మీద నేను బాంబులు వేసుకున్నాను
నా మీద నేను బరిశలు దించుకున్నాను
నన్ను నేను గొడ్డళ్ళతో నరుక్కున్నాను
నన్ను నేను ఈటెలతో పొడుచుకున్నాను
నా మీద నేను పెట్రోలు పోసుకున్నాను
నా మీద నేను అగ్గిపుల్ల వెలిగించుకున్నాను
నన్ను నేను లూటీ చేసుకున్నాను
నన్ను నేను లాటీ కావించుకున్నాను
నా మీద నేను కత్తులు దింపుకున్నాను
నా మీద నేను కాల్పులు జరుపుకున్నాను
నన్ను నేను బంద్ చేసుకున్నాను
నన్ను నేను బందీని కావించుకున్నాను
నా మీద నేను భయం పోసుకున్నాను
నా మీద నేను కర్ఫ్యూ కప్పుకున్నాను
నేను కుల జంతువుని
నేను రాజకీయప్పురుగుని
నేను అమానవుడిని



అకవులు